క్లుప్తంగా

మొక్కలు నాటిన డీఎంహెచ్‌ఓ

టేకులపల్లి: కలెక్టర్ ఇటీవల సులానగర్ పీహెచ్‌సీని సందర్శించి ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి మునగ, ఔషధ మొక్కలు నాటాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం పీహెచ్‌సీలో వనమహోత్సవం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి, ఎంపీడీఓ మల్లేశ్వరీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆస్పత్రి ఆవరణలో 100 మునగ, 100 ఔషధ మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్యాధికారులు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు కొత్తగూడెం కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికలలో ఎర్రజెండాను ఎగురవేస్తామని సీపీఐ పట్టణ నూతన కమిటీ నాయకత్వం ప్రకటించింది. శుక్రవారం స్థానిక శేషగిరి భవన్‌లో నూతన కార్యదర్శి కంచర్ల జమలయ్య, సహాయ కార్యదర్శి మునిగడప వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల నిర్మాణ కార్యదర్శి గెద్దెడ నగేష్ విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషాలు తమపై నమ్మకంతో పట్టణ మహాసభలో తమకు బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీ వివరాలు వివరించారు.

బ్రిడ్జిపై గుంతలు పూడ్చివేత

కొత్తగూడెంటౌన్: రామవరం గోధుమవాగు బ్రిడ్జిని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం పరిశీలించారు. బ్రిడ్జిపై గుంతల్లో చేరిన వర్షపు నీటిని పరిశీలించి తక్షణమే పూడ్చించాలని కార్పొరేషన్ అధికారులకు ఆదేశించారు. దీంతో అధికారులు సిబ్బందిచే గుంతల్లో నీటిని తొలగించి, కంకర, సిమెంట్‌తో పూడ్చి వేయించారు.

వేతనాలు సకాలంలో చెల్లించండి..

ఇల్లెందు: ప్రభుత్వాస్పత్రి శానిటేషన్ సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలని టీయూసీఐ నేతలు యాకుబ్‌షావలీ, పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి విచ్చేసిన డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. గురునాథం, ఝాన్సీ, రవి, కృష్ణవేణి, సునిత, లలిత తదితరులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్, బ్యాగుల వితరణ

పాల్వంచ: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల పేద విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్నులు, పలకలు, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కేటీపీఎస్ ఎ కాలనీ, వెంగళరావు కాలనీ, ప్రశాంత్ కాలనీ, సూరారం, పాండురంగాపురం, కరకవాగు పాఠశాలల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎంఈఓ ఎ.శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా వాటిని అందించారు. జాకబ్, రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య' విద్యార్థుల సత్తా

పాల్వంచ: ఇటీవల అమెరికాలోని నేషనల్ ఎరోనాటిక్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) నిర్వహించిన ప్రాజెక్ట్ పోటీల్లో పాల్వంచకు చెందిన శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. స్నిగ్ధా కార్తికేయ, వి.ఆకర్ష్, వి.తులసీరాజు, ఎ.యోగ కార్తికేయ, వి.హానిష్క్ మైథిలి, గాయత్రి, ఎం.అయానుద్దీన్‌లు గ్రూప్‌గా స్పేస్ కాలనీ ప్రాజెక్ట్‌ను రూపొందించి పంపించారు. ఆల్ ఇండియా స్థాయిలో 200 పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రాజెక్ట్‌కు జాతీయ స్థాయిలో తృతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ రమ్య షీల్డ్, సర్టిఫికెట్లను విద్యార్థులకు అందించి, అభినందించారు.

31న ఉపాధి ప్రజావేదిక

టేకులపల్లి: ఏప్రిల్ 2024 – మార్చి 2025 వరకు మండలంలో జరిగిన ఉపాధి పనులపై ఈనెల 24 నుంచి మండలంలోని గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీలు జరుగుతాయని ఎంపీడీఓ మల్లీశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీలు పూర్తయ్యాక 31న ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక సమావేశం ఉంటుందని అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

జూలూరుపాడు: 26, 27వ తేదీల్లో అశ్వారావుపేటలో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం జూలూరుపాడులో మాట్లాడారు. ఎస్కే నాగుల్‌మీరా, యల్లంకి మధు, ఎస్కే చాంద్‌పాషా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

10న పాటల పోటీలు

కొత్తగూడెంఅర్బన్: హీరో చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆగస్టు 10న కొత్తగూడెంలో పాటల పోటీలను నిర్వహిస్తున్నట్లు చిరంజీవి సేవా సమితి రాష్ట్ర కార్యదర్శి బి.విల్సన్‌బాబు, సినీ గీత రచయిత, గాయకులు మద్దెల శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9949752330, 7337500950 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.



సత్యనారాయణపురం పశువైద్యశాల

సుదీర్ఘకాలంగా వ్యవసాయంలో రైతులకు పశుసంపద అదనపు ఆదాయ వనరుగా ఉపకరిస్తోంది. సాగు భూమి లేని పలు కుటుంబాలు సైతం ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెల పోషణ ద్వారా ఎంతోకొంత ఆదాయం పొందుతున్నారు. వర్షాకాలం ప్రారంభం నుంచే సహజంగానే పశువులకు వివిధ రకాల వ్యాధులు సోకుతుంటాయి. ప్రస్తుతం పల్లెల్లో పశుసంపద వ్యాధులతో బాధపడుతున్నప్పటికీ ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందుల కొరత సమస్యగా మారింది. గత్యంతరం లేక రైతులు ప్రైవేటుగా మందులు కొనుగోలు చేస్తున్నారు.

పశువైద్యశాలల్లో మందుల్లేవు

- వర్షాలతో ప్రబలుతున్న వ్యాధులు
- ప్రైవేటుకు మందులు రాస్తున్న వైద్యులు
- రైతులకు భారంగా పశుపోషణ



సత్యనారాయణపురంలో అడవికి మేతకు వెళ్తున్న మేకలు

ఇల్లెందురూరల్: పూర్వం ప్రతీ రైతు ఇంట పశువులు అధిక సంఖ్యలో ఉండేవి. ఎద్దులు వ్యవసాయంలో ఉపయోపగపడగా.. గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ల ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా ఉండేవి. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం, అధిక మోతాదులో మందుల వాడకం, ఉమ్మడి కుటుంబాల స్థానంలో చిన్న కుటుంబాలు ఏర్పడటం, పశువుల వైద్యం ఆర్థికంగా భారంగా పరిణమించడం, స్థలం విలువ పెరగడంతో పెరడు రూపుమారిపోవడం వంటి కారణాలతో పశుసంపద క్రమంగా తగ్గుముఖం పడుతూ వస్తోంది. ఇటీవల పశుసంవర్ధకశాఖ నిర్వహించిన పశుగణన వివరాల ప్రకారం .. మండలంలో ప్రస్తుతం ఆవులు, ఎద్దులు 11,049, గేదెలు 5,427, గొర్రెలు 14,365, మేకలు 16,420, కోళ్లు 43,657, కుక్కలు 491, పందులు 251 ఉన్నాయి.

పశువులకు వచ్చే వ్యాధులు..

ప్రతీఏటా వర్షాకాలం ప్రారంభంలో పశువులు సహజంగానే వ్యాధుల బారిన పడుతుంటాయి. చీడపారడు రోగం, ముద్దచర్మ, గొంతువాపు, జబ్బువాపు, గాలికుంటు, గురక, మసూచి వ్యాధులు వస్తుంటాయి. వీటితోపాటు జ్వరం, అరుగుదల లేకపోవడం, గాయాలు, నోటిలో పుండ్లు ఏర్పడటం, ఎదకు రావడం కోసం వంటి విషయాలలో కూడా పశువులకు మందులు అవసరం.

నిలిచిన మందుల సరఫరా..

పశుసంవర్ధక శాఖ అధికారులు ఏడాదికి నాలుగు విడతలుగా పశువైద్యశాలలకు మందులు సరఫరా చేస్తుంటారు. ఆస్పత్రుల పరిధిలో ఉన్న పశుసంపద ఆధారంగా అవసరమైన మందులు సరఫరా చేపడుతుంటారు. అయితే గతేడాది అక్టోబర్ నుంచి పశువైద్యశాలలకు మందుల సరఫరా పూర్తిస్థాయిలో నిలిచిపోయింది. దీంతో పశువులకు సోకే వ్యాధులకు ఇచ్చే మందులు, వ్యాక్సిన్‌లు వైద్యశాలల్లో ఎక్కువ మొత్తంలో అందుబాటులో ఉండటం లేదు. దీంతో పశువైద్యులు ప్రైవేటు షాపులలో కొనుగోలు చేయాలని రైతులకు రాసిస్తున్నారు. పాడి పశువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు ఈ పరిణామం ఆర్థిక ఇబ్బందిగా మారుతోంది.

అవగాహన సదస్సుల జాడేది..?

పశువులకు వచ్చే వ్యాధుల జాగ్రత్తలపై ఏటా వేసవికాలంలోనే పశుసంవర్ధక శాఖ గ్రామాలలో నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలు క్రమంగా పలుచబడిపోతున్నాయి. వ్యాక్సిన్‌లు వేసే సందర్భంలో మాత్రమే అక్కడకు వచ్చే రైతులకు ఒకటి, రెండు మాటలు చెప్పి చేతులు దులుపుకుంటున్నారన్న రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో పశువులకు వచ్చే వ్యాధులపై రైతులకు అవగాహన లేక వ్యాధి ముదిరి అవి మృత్యువాత పడుతున్నాయి.

ప్రైవేటు జోరు.. ప్రభుత్వ వైద్యశాలల్లో మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం, కొమరారం వంటి ఏజెన్సీ ఆస్పత్రులో వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో రైతులు ఆర్థికంగా భారమైనా తమ పశువులకు ప్రైవేటుగా వైద్యం అందిస్తున్నారు. దీంతో పూర్తిస్థాయి అర్హత లేకున్నా పశువులకు వారు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు.

ప్రైవేటులో మందులు కొంటున్నాం..



ప్రస్తుతం పశువులు రోగాల బారిన పడుతున్నాయి. ఆస్పత్రికి తీసుకెళితే మందులు లేవంటున్నారు. ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు కూడా లేవు. ఉన్నతాధికారులు స్పందించి మందులు సరఫరా చేయాలి.

– పీకే శ్రీనివాస్, సత్యనారాయణపురం

త్వరలో సరఫరా జరుగుతుంది..



ప్రస్తుతం పశువులకు అవసరమైన మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. వారం క్రితం ఇండెంట్ పెట్టాం. త్వరలోనే సరఫరా జరుగుతుంది. పశువులకు అన్నిరకాల వ్యాక్సిన్‌లు వేస్తున్నాం. పశువులకు వచ్చే వ్యాధులపై రైతులను అప్రమతం చేస్తాం.

– కె.విజయ, ఏడీ, పశుసంవర్ధక శాఖ, ఇల్లెందు

'ఇంటింటికీ మన ఎమ్మెల్యే'కు ఘన స్వాగతం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: మన ఇంటికి మన ఎమ్మెల్యే కార్యక్రమానికి స్పందన లభించింది. పట్టణంలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి రేషన్‌కార్డులు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య స్వయంగా తాను ఇంటికి వచ్చి చెక్కు అందజేయబోతున్నట్లు సమాచారం అందటంతో ఇంటిల్లిపాది చుట్టుపక్కల వారితో కలిసి ఘనంగా స్వాగతం పలికారు. చెక్కు చేతికందించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ బానోతు రాంబాబు, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదళ్లపల్లి అనసూర్య, జి.వెంకటేశ్వర్లు, దొడ్డా డానియేల్, గండె సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు శాలువా కప్పి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్ రావు, కాళ్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పుట్టినరోజు వేడుకలను నాయకులు కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం 200 మంది ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఏనుగుల అర్జున్‌రావు, బాలశౌరి పాల్గొన్నారు.

28న కలెక్టరేట్ వద్ద ధర్నా

ఇల్లెందురూరల్: మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ తెలిపారు. ఈ మేరకు ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం భోజన వర్కర్ల సమావేశంలో మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు భోజనంలో వెజిటబుల్ బిర్యానీ, రెండు కూరలు పెట్టాలని చెబుతున్న సీఎం ఆ మేరకు మెస్ చార్జీలు పెంచాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



దీక్ష చేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నిబంధనలు లేకుండా రైతులకు రూ. 2లక్షల పైబడి ఉన్న వారికి కూడా రుణమాఫీ చేయాలని సేవాలాల్ సేన నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ అధ్యక్షతన కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌లో శుక్రవారం రుణమాఫీ దీక్ష చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన వ్యవస్థాపక అధ్యక్షుడు ధరావత్ ప్రేమ్‌చంద్ నాయక్ దీక్ష చేపట్టిన వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూక్యా భద్రు, మంగీలాల్, డి.సురేష్, ఎల్.వెంకటేష్, బి.నాగరాజు, లాలు, పవన్ కళ్యాణ్, కిషన్, రమేష్, బాలు, సురేష్, సీతారాం, హతీరాం, రవి, చరణ్ పాల్గొన్నారు.

యూరియా సరిపడా అందజేయండి..

టేకులపల్లి: అన్నదాతలకు యూరియా సరిపడా అందజేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాలోతు శివ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బేతంపూడి సొసైటీ కార్యాలయం వద్ద రైతుల సమావేశంలో మాట్లాడారు. టేకులపల్లి మండల కేంద్రంలో యూరియా పంపిణీ ఒక్కచోటే ఉండటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని బొమ్మనపల్లి, బోడు ప్రాంతాల్లో యూరియా పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూక్యా దేవ్‌సింగ్, రాజా, సునీల్, రూప్లా, మానిసింగ్, లచ్చు, నరేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్‌లో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: విద్య, ఉపాధ్యాయ రంగంలో సమస్యలు పరిష్కరించాలని లక్ష్మీదేవిపల్లి మండల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి దశల వారి పోరాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీఓ నంబర్ 25ను సవరించాలని, 60 మంది విద్యార్థులు దాటితే ముగ్గురు ఉపాధ్యాయుల నిబంధనను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను వెంటనే నిర్వహించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మా, జి.నాగేశ్వరరావు, తావుర్యా, పి.సత్యనారాయణ, బి.సరీయ, నర్సయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: విద్య, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూఎస్‌పీసీ నాయకులు శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వై.వీరస్వామి, మహేష్, వెంకటేశ్వర్లు, నరసింహారావు, సరిత, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేదల కల సాకారం: ఎమ్మెల్యే



సూపర్‌బజార్(కొత్తగూడెం): రేషన్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నో సంవత్సరాలుగా పేదలు ఎదురు చూస్తున్న రేషన్ కార్డులు మంజూరు కావడంతో వారి కల సాకారమైందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో శుక్రవారం జరిగిన కొత్తరేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో మొత్తం 4,633 కొత్త రేషన్ కార్డులు మంజూరు కాగా 7,962 కార్డులలో, కొత్తగూడెం మండలంలో 1,733 కార్డులు మంజూరు కాగా 2,188 కార్డులలో కుటుంబ సభ్యుల వివరాలను చేర్చడం జరిగిందని తెలిపారు. ఇంకా రెండు వేల వరకు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, 600 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషకార్డులు మంజూరు చేస్తామన్నారు. సీపీఐ వన్‌టౌన్ కార్యదర్శి నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు యూరియా కొరతపై కలెక్టర్‌ను ప్రశ్నించారు. స్పందించిన ఆయన ఖమ్మం గోడౌన్‌లో యూరియా ఉందని వర్షాలు తగ్గిన తరువాత స్టాక్‌ను తెప్పిస్తామని చెప్పారు. కాగా సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ వై.శ్రీనివాసరెడ్డి వేదికపై కూర్చోగా, ఎమ్మెల్యే కూనంనేని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఆయన వేదిక దిగిపోయారు. ఈ క్రమంలో కాంగ్రెస్, సీపీఐ నాయకుల మధ్య వాగ్వాదం నెలకొంది. కొత్తగూడెం ఆర్డీఓ మధు, డీఎస్ఓ రుక్మిణీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: పెద్దమ్మగుడి సముదాయంలోని ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని 490 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కాగా, ఈ కార్యక్రమానికి ఆలయ పాలకమండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు రాగా.. వేదిక కింద కూర్చున్నాడు. ఆలయ పరిధిలో జరిగిన కార్యక్రమ వేదికపైకి ప్రొటోకాల్ ప్రకారం తనను పిలకుండా తహసీల్దార్ అవమానించారని చెబుతూ బాలినేని వెనుదిరిగారు. కొత్వాల శ్రీనివాసరావు, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐలు రవికుమార్‌రెడ్డి, నళినీకుమార్ పాల్గొన్నారు.

కార్యకర్తలు కష్టపడి పని చేయాలి

జూలూరుపాడు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచి అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా రమేష్ పిలుపునిచ్చారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పడమటనర్సాపురంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ధరావత్ బాలకిషన్, భూక్యా శ్రీను, రామారావు, రాంబాబు, చరణ్, బాబులాల్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం..



కేక్ కట్ చేస్తున్న రామారావు

పాల్వంచ: విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే కేంద్ర ప్రభుత్వ కుట్రలను అడ్డుకుంటామని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్–142) రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.రామారావు అన్నారు. శుక్రవారం యూనియన్ 13వ వార్షికోత్సవం సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎ కాలనీలోని ప్రాంతీయ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల హక్కుల సాధనకై నిరంతరం పోరాడే కార్మిక సంఘం హెచ్ 142 అన్నారు. ప్రైవేటీకరణను మూకుమ్మడిగా ఎదుర్కోవాలని, ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని, ఈ పరిస్థితి ఈ రాష్ట్రంలో రానీయమన్నారు. ఆర్టిజన్‌ల విద్యార్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలని, ఓఅండ్ఎం కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమలో ఎస్.శ్రీనివాసచారి, డి.సత్యరాజ్ స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు, షేక్.సయ్యద్, ఎం.శివరాం, తోలేం కోటేశ్వరరావు, మధు, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో సమస్యలు పరిష్కరించండి..

ఇల్లెందురూరల్: మండలంలోని పీహెచ్‌సీలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పీవైఎల్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. సంఘం రాష్ట్ర నాయకుడు మోతీలాల్ మాట్లాడుతూ.. ఏజెన్సీ గ్రామాలకు పెద్ద దిక్కైన కొమరారం పీహెచ్‌సీ స్థాయి పెంచాలని, గైనకాలజిస్ట్, అదనపు వైద్యులు, సిబ్బంది నియామకం చేపట్టాలని కోరారు. 24 గంటలు వైద్యసేవలు అందించాలని, పూర్తిస్థాయిలో మందులు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆస్పత్రిలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జోగ కృష్ణ, వాంకుడోత్ శ్రీను, బానోత్ సంతు, మూడు మాలు, కిషోర్, లక్ష్మణ్, రమేష్, భావ్‌సింగ్, హరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీచండీ సర్వజ్ఞ పీఠంలో ప్రత్యేక పూజలు

కొత్తగూడెంటౌన్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీలోని శ్రీచండీ సర్వజ్ఞ పీఠంలో వేదపండితులు దండిబోట్ల రామాంజనకుమార శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం నవమ పూజలు ఘనంగా నిర్వహించారు. నవమి వార్షికోత్సవంలో భాగంగా వెయ్యి చీరలు, లక్ష పసుపు కొమ్ములు అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రేపు చండీ హోమం పూజలు నిర్వహించనున్నట్లు చండీ పీఠం వ్యవస్థాపకులు వేదపండితులు దండిబోట్ల రామాంజన కుమారశర్మ తెలిపారు.



పూజకు హాజరైన మహిళలు


నిలిచిన రోడ్డు విస్తరణ పనులు

- అస్తవ్యస్తంగా మారిన రహదారి..
- ఇరవై గ్రామాల ప్రజలకు బురద కష్టాలు

జూలూరుపాడు: జూలూరుపాడు–పాపకొల్లు ఆర్ అండ్‌బీ బీటీ రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఏడునెలల క్రితం ప్రారంభమైన డబుల్ రోడ్డు విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. విస్తరణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ గ్రావెల్ పోసి వదిలేయడంతో వానలకు రోడ్డంతా అస్తవ్యస్తంగా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో బైక్‌లు, ప్రయాణికులతో వెళ్లే ఆటోలు, కార్లు, ట్రాలీలు ప్రమాదాల బారినపడుతున్నాయి. పాపకొల్లు డబుల్ రోడ్డు విస్తరణ పనులు జూన్ ఆఖరి నాటికి పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ అధికారుల ఉదాసీనమే కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. పనులు ఆగిపోవడంతో జడలచింత గ్రామంలో వర్షపునీరంతా ఇళ్లలోకి చేరుతుండగా జూలూరుపాడు కోయకాలనీలోనూ ఇదే పరిస్థితి ఎదురవుతోంది. ఐదు గ్రామ పంచాయతీల పరిధిలో 20 గ్రామాల ప్రజలు బురద మయంగా మారిన రోడ్డుపై రాకపోకలు సాగించలేక అష్టకష్టాలు పడుతున్నారు.

రూ.5 కోట్ల నిధులతో..

మండల కేంద్రంలోని తల్లాడ–భద్రాచలం రాష్ట్రీయ రహదారి నుంచి పాపకొల్లు వరకు ప్రస్తుతం ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మంజూరయింది. ఇందుకోసం డీఎంఎఫ్‌టీ రూ.5 కోట్లు కేటాయించగా టెండర్లకు రెండేళ్లు పట్టింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 2022 సంవత్సరంలో జూలూరుపాడు ప్రధాన సెంటర్‌లో తల్లాడ–భద్రాచలం రాష్ట్రీయ రహదారి విస్తరణ, డ్రెయినేజీలు, డివైడర్‌పై గ్రిల్స్, సెంట్రల్ లైటింగ్, జూలూరుపాడు–చీపురుగూడెం వరకు బీటీ రోడ్ విస్తరణ కోసం డీఎంఎఫ్‌టీ రూ 5.22 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో జూలూరుపాడులో రహదారి విస్తరణ, డ్రెయినేజీలు, డివైడర్‌పై గ్రిల్స్, సెంటల్ లైటింగ్ పూర్తి చేశారు. అయితే జూలూరుపాడు–చీపురుగూడెం రహదారి విస్తరణ పనులు చేపట్టకపోవడంతో రూ.88 లక్షల నిధులు మిగిలి ఉన్నాయి. ఈ నిధులతో జూలూరుపాడు–పాపకొల్లు రోడ్డులో 600 మీటర్ల మేర మండల కేంద్రం వెలుపల నుంచి ఈద్గా వరకు డబుల్ రోడ్ విస్తరణ చేపట్టగా మిగిలిన రహదారిని విస్తరించేందుకు గ్రావెల్ పోశారు. కానీ జూలూరుపాడు సెంటర్‌లోని తల్లాడ–భద్రాచలం ప్రధాన రహదారి నుంచి జూలూరుపాడు శివారు వరకు సీసీ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. అలాగే, జూలూరుపాడు నుంచి వయా పాపకొల్లు మీదుగా చీపురుగూడెం వరకు సుమారు 12 కిలోమీటర్ల దూరం సింగిల్ బీటీ రోడ్డు ఉంది. ఈ రహదారి పరిధిలో 20 గ్రామాల ప్రజలు రాకపోకలు కొనగిస్తుంటారు. జూలూరుపాడు నుంచి పాపకొల్లు వరకు 3.4 కిలోమీటర్లు డబుల్ రహదారి నిర్మించాలి. ప్రస్తుతం సింగిల్ రహదారిపై ప్రతినిత్యం ఆటోలు, ట్రాలీలు, లారీలు, కార్లు, బైక్, స్కూల్ బస్సుల రాకపోకలతో రద్దీగా ఉండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది.



బురదమయంగా మారిన రోడ్డు

పనులు పూర్తి చేయాలి



డబుల్ రోడ్ విస్తరణ పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. పనులు నిలిచిపోవడంతో బురదగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఎరువు కట్టలను ట్రాక్టర్, ఆటో, ట్రాలీపై తీసుక రావడం కూడా కష్టంగా ఉంది.

– సాయిన్ని శ్రీనివాసరావు, కొత్తూరు

రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది



రహదారిపై మట్టి పోసి వదిలేయడంతో వర్షాలకు అస్తవ్యస్తంగా మారింది. పాపకొల్లు నుంచి జూలూరుపాడు బైక్‌పై వెళ్లి రావాలంటే యాతన పడుతున్నాం. మూడు వారాల క్రితమే రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. – ధర్మరాజుల రాఘవులు, పాపకొల్లు